క్లుప్తంగా

వైభవంగా సీతారామస్వామి కల్యాణం



సీతారామస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని టౌన్‌హాల్ ఎదురుగా ఉన్న సీతారామస్వామి ఆలయంలో శుక్రవారం స్వామి జన్మనక్షత్రం పునర్వసును పురస్కరించుకుని స్వామి వారి కల్యాణం ఎంతో వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పాణింగపల్లి మాధవాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు శాస్త్రోక్తంగా కల్యాణం చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ ఈఓ బీవీఆర్ చౌదరి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చేయూత రవికి గౌరవ డాక్టరేట్

బాలాజీచెరువు: చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు మొండి రవికుమార్ గౌరవ డాక్టరేట్‌కు ఎంపికయ్యారని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి శుక్రవారం తెలిపారు. సమాజానికి దశాబ్దకాలంగా సేవలు చేయడం వల్ల ఏషియన్ వేదిక కల్చర్ యూనివర్సిటీ ఈ నెల 25న కర్ణాటకలో హోసూర్‌లో డాక్టరేట్ ప్రదానం చేయనున్నారు. విద్యా సంస్థల డైరెక్టర్ లక్ష్మీరాజ్యం, శృతిరెడ్డి, సుగుణారెడ్డి, కర్రి పద్మశీలతో పాటు ఎన్‌జీవో నాయకులు రవికుమార్‌ను అభినందించారు.

శాస్త్రి కళాప్రాంగణం నేడు ప్రారంభం

కాకినాడ కల్చరల్: స్థానిక రాజారామ్మోహన్‌రాయ్ వీధిలోని కాకినాడ పెన్షనర్స్ భవనం మొదటి అంతస్తులో శాస్త్రి కళాపీఠం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 5 గంటలకు శాస్త్రి కళా ప్రాంగణం (సాహితీ, కళారంగాల ఐక్యవేదిక) ప్రారంభించనున్నట్టు పీఠం వ్యవస్థాపకులు పీఎస్ఎస్ఎన్‌పీ శాస్త్రి తెలిపారు. ఈ సందర్భంగా సీతారామరాజు స్మారక కళావేదిక వ్యవస్థాపకులు పంపన దయానందబాబు, వ్యక్తిత్వ వికాసం సంస్థ వ్యవస్థాపకులు అద్దేపల్లి ఉదయభాస్కర్, డీసీ, యూట్యూబ్ చానల్, సాహిత్య, సాంస్కృతిక, కళారంగాల ప్రోత్సాహ వేదిక వ్యస్థాపకులు దాడి చంద్రశేఖర్‌లకు సన్మానం చేయనున్నట్టు శాస్త్రి తెలిపారు.

ధరలు తగ్గించాలి



గ్యాస్ ధరలు తగ్గించాలంటూ ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కాకినాడ సిటీ: పెంచిన గ్యాస్, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, పెట్రోల్, డీజిల్ జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని, ధరల పెరుగుదల నియంత్రణకు ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఎం కాకినాడ కమిటీ ఆధ్వర్యంలో కచేరిపేట 37వ సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రైతుల పంటలకు మద్దతు ధర చట్టం చేయాలన్నారు. మూడు రాష్ట్రాల ఎన్నికలు కాగానే ధరలు పెంచడం దుర్మార్గమన్నారు. సీపీఎం నాయకులు జి.బేబీరాణి, కె సత్తిరాజు, చెక్కల రాజ్‌కుమార్, మలకా రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆప్ ఆధ్వర్యంలో..

కాకినాడ సిటీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద శుక్రవారం ఆప్ నాయకులు ధర్నా నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి కృష్ణమోహన్, అడపా రామకృష్ణ, వి.కృష్ణమూర్తి, జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా ‘మీ భూమి-మా హామీ’

- రీ సర్వే సమగ్రంగా చేపట్టాలి
- ఆర్డీఓ రామారావు



వడ్లమూరులో అధికారులతో పర్యటిస్తున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: రాష్ట్ర వ్యాప్తంగా వందేళ్ల తరువాత గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వ్యవసాయ, గ్రామకంఠం స్థిరాస్తుల సర్వే కోసం సీఎం జగన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ‘మీ భూమి-మా హామీ’ పేరిట భూ రీసర్వే చేపట్టారని ఆర్డీఓ జిక్కుల సీతారామారావు అన్నారు. మీ భూమి మా హామీ పథకంలో భాగంగా మండలంలోని వడ్లమూరులో శుక్రవారం భూ రీ సర్వేను పరిశీలించారు. డివిజన్ వ్యాప్తంగా ఒక్కో గ్రామానికి పైలట్ ప్రాజెక్టుగా రీ సర్వే చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సమగ్రంగా విజయవంతం చేయాలని ఆర్డీఓ సూచించారు. అనంతరం రైతుల పొలాల్లో వేసిన సరిహద్దు రాళ్లను, జగనన్న కాలనీ లే అవుట్‌లోని ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. తహసీల్దార్ వజ్రపు జితేంద్ర, హౌసింగ్ ఏఈ సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పిక్క పీకినా.. లెక్క తగ్గకుండా..

- కుక్క కాట్ల నియంత్రణకు చర్యలు
- ఏబీసీ, ఏఆర్‌వీల ద్వారా నియంత్రణ
- నగరంలో 14,500 వీధి కుక్కలు



కాకినాడ క్రైం: వీధి కుక్కల దాడిలో జీవితాలు విషాదాంతాలవుతున్న నేపథ్యంలో నగర మున్సిపల్ శాఖ అప్రమత్తమైంది. కుక్కలకు హాని లేకుండా వ్యక్తుల్ని రక్షించుకునే అనుసరణీయమైన విధానాలపై నిపుణుల సూచనల మేరకు చర్యలు తీసుకుంటున్నారు.

నగరంలో 14,500 వీధి కుక్కలు

మున్సిపల్ శాఖ గణాంకాల ప్రకారం నగరంలో 14,500 వీధి కుక్కలు ఉన్నాయి. వీటిలో 9 వేల కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించారు. మిగిలిన వాటి వల్లే ప్రమాదం సంభవించే ఆస్కారం ఉంది. పలు కుక్కలు ర్యాబిస్‌కు గురి కావడం ఆందోళన కలిగించే అంశం. అవే పిచ్చికుక్కలుగా మారి ప్రజలకు ప్రమాదకరంగా మారుతున్నాయి.

ఏబీసీ... ఏఆర్‌వీ....

యానియల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) శస్త్రచికిత్స, యాంటీ ర్యాబిస్ వ్యాక్సినేషన్(ఏఆర్‌వీ) ద్వారా కుక్కలు ప్రమాదకరంగా మారే స్థితిని అధిగమించవచ్చు. ఇందుకోసం కాకినాడ ఏటిమొగ శ్మశాన వాటిక సమీపంలో ఏబీసీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇద్దరు వెటర్నరీ వైద్యుల ఆధ్వర్యంలో స్నాప్ ఏజెన్సీ స్వచ్ఛంద సంస్థ పర్యవేక్షణలో ప్రతి రోజు కనీసం 9 శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ఒక కుక్కకు శస్త్రచికిత్స చేసేందుకు కనిష్టంగా అరగంట, గరిష్టంగా గంట వ్యవధి పడుతుందని వైద్యులు తెలిపారు.

పెరుగుతున్న కేసులు

కాకినాడ జీజీహెచ్‌లో కుక్క కాట్లతో వస్తున్న బాధితుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ఇక్కడి అవుట్‌పోస్టు పోలీస్‌స్టేషన్‌ను ఆనుకొని ప్రత్యేక రేబిస్ వ్యాక్సినేషన్ కేంద్రం ఉంది. నాలుగు డోసుల్లో ఈ వ్యాక్సిన్ వేస్తారు. కుక్క కరిచిన 24 గంటలలోపు ఒక డోసు, మూడో రోజు రెండో డోసు, ఏడో రోజు మూడో డోసు, 28వ రోజు నాలుగో డోసు చేస్తారు. నాలుగు నెలల వ్యవధిలో ఏఆర్‌వీ టీకాల గణాంకాలను పరిశీలిస్తే..

నెల	కుక్కకాట్లు	టీకాలు
నవంబర్-2022లో	19,	77
డిసెంబర్-2022లో	23	81
జనవరి-2023లో	27	85
ఫిబ్రవరి-2023లో	29	89

బర్త్ రేట్ 22... డెత్ రేట్ 3....

ఏడాది వ్యవధిలో కుక్కల సంఖ్య 12 శాతం మేర పెరిగింది. నగరంలో వీధి కుక్కల బర్త్ రేట్ 22 శాతంగా ఉంటే, డెత్ రేట్ 3 మాత్రమే ఉంది. వీటి జీవిత కాలం 10 నుంచి 13 ఏళ్లు. కోవిడ్ రెండేళ్లలో కుక్కల సంఖ్య నగరంలో అసంఖ్యాకంగా పెరిగింది. ఆ సమయంలో మరణాలూ ఏమీ లేవు. రహదారి ప్రమాదాల వల్ల కుక్కల మరణాలు ఎక్కువగా సంభవిస్తూ ఉంటాయని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.



జీజీహెచ్‌లో బాలికకు ఏఆర్‌వీ ఇస్తున్న నర్స్



జీజీహెచ్‌లో రేబిస్ వ్యాక్సినేషన్ కేంద్రం

విపరీత ప్రవర్తన గుర్తిస్తే ఫిర్యాదు చేయండి



కుక్కల్లో విపరీత ప్రవర్తన కనిపిస్తే స్థానిక సచివాలయాల్లో ఫిర్యాదు చేయండి. సాధారణంగా, కరిచే లక్షణం ఉన్న కుక్కలకు రేబిస్ ఉండే అవకాశం ఉంది. వాటి నియంత్రణకు వాటిని అదుపులోకి తీసుకొని ప్రత్యేక ప్రదేశాల్లో ఉంచి వైద్యం చేస్తాం. వాటి రక్షణ, పోషణను స్నాప్ స్వచ్ఛంద సంస్థ పర్యవేక్షిస్తుంది. కలెక్టర్, కమిషనర్ల మార్గనిర్దేశంలో పిచ్చికుక్కల వల్ల కలిగే ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి.

– డాక్టర్ పృథ్వీ చరణ్

పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్



పారిశుధ్యంపై సమీక్షిస్తున్న కమిషనర్ నాగ నరసింహారావు

కాకినాడ: నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ మరింత మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ పీహెచ్ నాగనరసింహారావు చెప్పారు. శుక్రవారం ఆయన ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్‌తో కలిసి శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లతో సమీక్షించారు. పారిశుధ్యాన్ని పూర్తిగా గాడిలో పెట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆదివారం కూడా చెత్త సేకరణకు తీసుకోవలసిన చర్యలపై సూచించారు. వారం రోజుల్లో ఇవన్నీ అమల్లోకి వచ్చేలా చూడాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణ లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. శానిటరీ సూపర్‌వైజర్లు జిలానీ, రాంబాబు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

మే చివరి నాటికి పూడికతీత పనుల పూర్తి

నగరంలోని అన్ని డ్రైనేజీల్లోనూ మే చివరి నాటికి పూడికతీతలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని నాగ నరసింహారావు చెప్పారు. శుక్రవారం ఆయన 13వ సర్కిల్ పరిధి 40వ డివిజన్ రామారావుపేటలో జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. నగరంలోని 14 శానిటరీ సర్కిళ్లలోనూ వర్షాలు పడే లోపు మే చివరి నాటికి పూడికతీత పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు డీపీటీఓ సత్కారం



ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డీపీటీఓ శ్రీనివాసరావు

కాకినాడ: ఆర్టీసీ అభివృద్ధికి ఉద్యోగులు కష్టించి పని చేయాలని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు కోరారు. ఆర్టీసీ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ జరిగింది. జనవరి నెలలో అత్యధిక ఆదాయాన్ని తెచ్చిన డ్రైవర్, కండక్టర్లను అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. మెరుగైన ఆదాయం రావడంలో కృషి చేసిన సూపర్‌వైజర్లు, గ్యారేజీ, సెక్యూరిటీ సిబ్బందిని సత్కరించారు. అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, అసిస్టెంట్ ఇంజినీర్ కె.ప్రభాకర్, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను రక్షించుకుందాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న విశ్రాంత పోలీసు ఉద్యోగి సత్యనారాయణరాజు

కాకినాడ రూరల్: ఇంటికి వెలుగైన ఆడ పిల్లలను రక్షించుకుందామని విశ్రాంత పోలీసు ఉద్యోగి బుద్ధరాజు సత్యనారాయణరాజు పేర్కొన్నారు. బేటీ బచావో – బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా సర్పవరం జంక్షన్‌లో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ చట్టరీత్యా అనేక చట్టాలు ఉన్నప్పటికీ ఆడ పిల్లలపై దౌర్జన్యాలు, అఘాయిత్యాలు పెరగడం బాధాకరమన్నారు. ఆడ పిల్లలను పెంచడం, చదవించడం భారం కాదన్నారు. ప్రభుత్వం పలు పథకాల ద్వారా చక్కగా చదువుకోవడానికి అవకాశం కల్పిస్తోందని, గర్భస్రావం చేయించుకోకూడదన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వినికిడి సమస్యలపై అశ్రద్ధ వద్దు

కాకినాడ రూరల్: ప్రస్తుత జీవన విధానంలో మితిమీరిన సామాజిక మాధ్యమాలు ఉపయోగించడం, పెద్ద శబ్దాలు వినడం వల్ల చిన్న, పెద్ద వయసు తారతమ్యం లేకుండా వినికిడి సమస్యలు ఏర్పడుతున్నాయని, వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని ప్రముఖ ఆడియోజిస్ట్ ఎస్.శ్రీను నాయక్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ వినికిడి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శక్తివంతమైన స్మార్ట్ ఫోన్లలో ఎక్కువసేపు మాట్లాడటం వల్ల అధిక రేడియేషన్ విడుదలై వినికిడి లోపం వస్తుందన్నారు. చెవిలో నూనె వేయడం, ఇతర వస్తువులతో చెవిలో తిప్పకూడదని హెచ్చరించారు. ఈ సందర్భంగా మా స్వాతి హియరింగ్ సొల్యూషన్స్ వద్ద రెండు రోజుల పాటు ఉచితంగా వినికిడి పరీక్షలు నిర్వహిస్తున్నందున సద్వినియోగపరుచుకోవాలని శ్రీను నాయక్ తెలిపారు. అడబాల రత్న ప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు నిధులు సరిగా ఖర్చు చేయండి



సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సిబ్బంది తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

- ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్
- ప్రభుత్వ జూనియర్ కళాశాల, హాస్టల్ తనిఖీ
- సిబ్బంది పనితీరుపై ఆగ్రహం

సామర్లకోట: విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ శుక్రవారం సాయంత్రం అధికారులను పరుగులు పెట్టించారు. పెద్దాపురం మండలం చంద్రమాంపల్లిలో తనిఖీల అనంతరం ఆయన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాడు-నేడు పనులను తనిఖీ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.కోటి 10 లక్షలు మంజూరైతే కేవలం రూ.నాలుగు లక్షలు మాత్రమే ఖర్చు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో యూరినల్స్ లేకుండా మరుగుదొడ్లు మాత్రమే నిర్మించడం సరికాదని, బాలికలు, బాలురకు యూరినల్స్ ఏర్పాటు చేయాలన్నారు. నిర్మాణ సామగ్రిని సకాలంలో అందజేయక పోవడంపై విద్యాశాఖ ఇంజినీరింగ్ అధికారులు వెంకటేశ్వరరావు, నటరాజ్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరామమూర్తి పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నాడు-నేడు పనులను తరుచూ పరిశీలించాలని ఆర్‌జేడీ నాగమణిని ఆదేశించారు. సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ గురించి అడిగితే గిరిజన సంక్షేమ హాస్టల్‌కు తీసుకువెళ్లిన అధికారులపై అసంతృప్తి వ్యక్తంచేశారు. సాంఘిక సంక్షేమ శాఖ బీసీ బాలిక హస్టల్‌ను గుర్తించి తనిఖీ చేసి 20 మంది మాత్రమే ఉండడంపై నిర్వహణ సరిగా లేదని అన్నారు. పాఠ్య పుస్తకాలు హాస్టల్‌లో కాకుండా పాఠశాలలో ఉన్నాయని చెప్పడంపై వార్డెన్ జయసుందరి పనితీరును తప్పు పట్టారు. బాలికలకు ఇచ్చి ట్యాబ్‌లను ఆయన పరిశీలించారు. బాలికల విద్యపై పరిశీలన ఉండాలని ఆర్‌జేడీని ఆదేశించారు. డీఈఓలు అబ్రహం, కె.అన్నపూర్ణ, డీవైఈఓలు ఆర్‌జేడీ రాజు, సుభద్ర, ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య, హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలయోగి సేవలు మరువలేనివి

కరప: జిల్లా అభివృద్ధికి కృషిచేసిన లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి చిరస్మరణీయుడని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. పెనుగుదురులో శుక్రవారం బాలయోగి 20వ వర్ధంతి నిర్వహించారు. యండమూరులో ఎస్సీనాయకులు, టీడీపీ నాయకులు లోక్‌సభ మాజీస్పీకర్ బాలయోగి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి నడకుదురులో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికీ మీ అనంతలక్ష్మి, ఇదేం కర్మ మనరాష్ట్రానికి నిర్వహించారు.

జగన్నాథపురం సెంటర్‌లో

కాకినాడ సిటీ: లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి వర్ధంతిని జగన్నాథపురం బాలయోగి సెంటర్ వద్ద టీడీపీ నాయకులు శుక్రవారం నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు వనమాడి వెంకటేశ్వరరావు తదితరులు బాలయోగి విగ్రహానికి నివాళులర్పించారు.

పేదలకు వస్త్రాల పంపిణీ



పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న రత్నప్రసాద్ తదితరులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆధ్యాత్మిక వేత్త రవిశంకర్ పట్నాయక్ మాట్లాడుతూ సమాజ సేవతో ఎంతో సంతృప్తి ఉంటుందని, దీనిని అడబాల ట్రస్ట్ ఎంచుకోవడం అభినందనీయన్నారు. కార్యక్రమంలో రేలంగి బాపిరాజు, సత్యనారాయణరాజు, శ్రీనగేష్, తదితరులు పాల్గొన్నారు.

నీటి వనరులు కాపాడుకోవాలి



జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ డాక్టర్ ఆలపాటి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: నీటి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ డాక్టర్ ఆలపాటి శ్రీనివాస్ అన్నారు. స్థానిక రోటరీ హాల్‌లో శుక్రవారం రోటరీ క్లబ్ కాకినాడ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రోటరీ క్లబ్ కాకినాడ మార్చి నెలను రోటరీ వాటర్, శానిటేషన్ మంత్ థీమ్ ప్రకటించి పలు కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. నీటి కాలుష్యం, నీటి వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకుని భావితరాలకు స్వచ్ఛమైన నీటిని అందించాలన్నారు. ఆలపాటి శ్రీనివాస్‌ను సత్కరించి, జ్ఞాపిక అందించారు. రోటరీ క్లబ్ కాకినాడ అధ్యక్షురాలు సురభి శారద, సభ్యులు సలాది సూర్యకిరణ్, కల్యాణ్‌చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సోమేశ్వరుని రథయాత్ర



వేట్లపాలెంలో సాగుతున్న స్వామివారి రథయాత్ర

సామర్లకోట: వేట్లపాలెంలోని రాజరాజేశ్వరీ సమేత సోమేశ్వర స్వామి రథయాత్ర శుక్రవారం ఘనంగా సాగింది. స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గ్రామోత్సవం జరిగింది. మాజీ ఎంపీపీ కొండపల్లి కృష్ణమూర్తి, గ్రామ ఉపసర్పంచ్ గోలి శ్రీరామ్, మాజీ ఉపసర్పంచ్ గోలి వెంకట్రావు, ఉత్సవ కమిటీ నాయకులు పుట్టా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా స్వామివారి కల్యాణం

వేట్లపాలెంలోని రాజరాజేశ్వరీ సమేత సోమేశ్వర స్వామి కల్యాణం శుక్రవారం రాత్రి నేత్ర పర్వంగా జరిగింది. రథయాత్ర అనంతరం ఆలయానికి చేరిన ఉత్సవ విగ్రహాలను వేదికపై ఉంచి కల్యాణం జరిపించారు. ఉత్సవ కమిటీ నాయకులు భక్తులకు సేవలందించారు.

వీధికుక్కలు, పందుల నియంత్రణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న మండల పశువైద్యాధికారి డాక్టర్ రవికిరణ్‌బాబు

కరప: గ్రామాల్లో వీధి కుక్కలు, పందుల నివారణకు మండల, గ్రామ పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేసి, తగిన చర్యలు తీసుకుంటామని మండల ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, పశుసంవర్ధకశాఖ వైద్యాధికారులు, సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్లతో ఈఓ పీఆర్డీ సమావేశమయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ సమస్యపై చర్చించారు. పెంపుడు కుక్కలు ఉన్న వాళ్లు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలన్నారు. పందుల పెంపకందార్లతో మాట్లాడి, గ్రామానికి దూరంగా పెంచుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సొంత కుక్కలకు ఏఆర్‌వీ ఇంజక్షన్లు చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎం.రవికిరణ్‌బాబు మాట్లాడుతూ చట్ట ప్రకారం పందులు, కుక్కల హక్కులకు భంగం వాటిల్లకుండా వాటి నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని, దానికి గ్రామ పంచాయతీలే బాధ్యత వహించాలన్నారు. మెదడువాపు వ్యాధి రాకుండా సకాలంలో ఇంజక్షన్లు చేయించాలన్నారు. వీధి కుక్కలు కరవడం వల్ల రేబిస్ వస్తుందని, పిచ్చికుక్కల అయితే ప్రమాదకరమన్నారు. వీధికుక్కల వ్యాప్తిని అరికట్టేందుకు జంతు సంక్షేమ సంఘ ప్రతినిధులు, పర్యవేక్షణ కమిటీల పర్యవేక్షణలో నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు సంతాన నిరోధక ఆపరేషన్లు చేయించాలన్నారు. ఏఓ గుత్తుల భీమశంకరరావు, వేళంగి, అరట్లకట్ట పశువైద్యాధికారులు డాక్టర్ అనిల్ విల్సన్, డాక్టర్ బి.తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

జంతుహింస నివారణ సంఘం ఆధునీకరణ



సంఘంలో సౌకర్యాల కల్పనపై చర్చిస్తున్న సభ్యులు

బోట్‌క్లబ్: స్థానిక నాగమల్లితోట జంక్షన్‌లో ఉన్న జంతుహింస నివారణ సంఘాన్ని ఆధునీకరించాలని సభ్యులు తీర్మానించారు. సంఘ కార్యాలయంలో శుక్రవారం సంఘ సభ్యులు, దాతలు సమావేశం నిర్వహించారు. సంఘ ప్రాంగణం సుందరీకరణ, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి చేయాలని సమావేశంలో నిర్ణయించారు. సంఘ చైర్మన్, మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ రమేష్‌కు వినతిపత్రం ఇవ్వాలని తీర్మానించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు, దంత వైద్యులు అద్దాల సత్యనారాయణ మాట్లాడుతూ మన సంస్కృతిలో గోవును దైవంగా భావిస్తున్నామన్నారు. ఈ ప్రదేశంలో గోవుల సంరక్షణతో పాటు ఇతర మూగ జీవాల పట్ల శ్రద్ధ చూపుతున్న మంతెన రామ్ సేవలు అభినందనీయమన్నారు. హోలీ సందర్భంగా ఈ నెల 8న గోపూజ నిర్వహించనున్నట్లు చెప్పారు. సంఘంలో ఆవులకు ఆహారం అందించేందుకు నగరంలో దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. సంఘ సభ్యులు ప్రసాద్‌రెడ్డి, మనీష్‌తివారీ, లలిత్ లునాని తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న తండ్రీ కొడుకుల అరెస్టు

కాకినాడ క్రైం: కాకినాడకు చెందిన తండ్రీకొడుకుల్ని అక్రమ మద్యం కేసులో పోలీసులు అరెస్టు చేశారు. కాకినాడ విముక్తి కాలనీకి చెందిన విశ్వాల కిశోర్, అవినాష్ తండ్రీ కొడుకులు. వీరిద్దరూ చీప్ లిక్కర్ క్వార్టర్ బాటిళ్లను అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వీరిద్దర్నీ శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నాయక్ తెలిపారు. వీరిపై గంజాయి విక్రయిస్తున్న కేసులతో పాటు ఇతర కేసులు ఉన్నాయని అన్నారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం

ఎంపీ గీత, హౌసింగ్ చైర్మన్ దొరబాబు



ఆలయ పూజల్లో పాల్గొన్న ఎంపీ గీత, దొరబాబు

పెద్దాపురం: ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన ఎంతో అవసరమని ఎంపీ వంగా గీత, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని సిరివాడలో శుక్రవారం రామాలయం విగ్రహ పునఃప్రతిష్ఠకు వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వ్యవసాయ సలహా మండలి సభ్యుడు యినకొండ వీర విష్ణుచక్రం అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ సభలో వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తమవంతు సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. శ్రీరాముడి దయతో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలన్నారు. అనంతరం ఆలయ పునఃప్రతిష్ఠలో ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, పులిమేరు సొసైటీ అధ్యక్షుడు గోపు నారాయణమూర్తి, మద్దూరి వెంకటేశ్వరరావు, చంటిబాబు, భక్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో ఎంపీ పూజలు

సామర్లకోట: మండల పరిధిలో పీబీ దేవంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని పురస్కరించుకుని ఎంపీ వంగా గీత, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు, సొసైటీ అధ్యక్షుడు మలకల వరహాలబాబు, గ్రామ సర్పంచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. వేట్లపాలెంలోని సోమేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాలలోను వారు పాల్గొన్నారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పెద్దాపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి వీరభద్రం పాల్గొన్నారు.